ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 31.08.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. మూసారాంబాగ్‌లో మూసీ నదిపై నూతనంగా నిర్మించిన హైలెవెల్ వంతెనను ఈరోజు సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.
2. కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి అలంపూర్ జోగులాంబ అమ్మవారిని దర్శించుకుని, భక్తుల సౌకర్యార్థం రూ.45 కోట్లతో ఆర్వోబీ ని నిర్మిస్తున్నామని వెల్లడించారు.
3. వెయ్యి రోజుల పాలన పూర్తికావడంపై హర్షం వ్యక్తం చేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించామని తెలిపారు.
4. ప్రకృతి సంరక్షణ కోసం మట్టి వినాయకులు, సీడ్ గణేశులను పూజించాలని ప్రముఖ నటుడు చిరంజీవి పిలుపునిచ్చారు.
5. ఉపరితల ఆవర్తన ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.

------------------------------

**మూసారాంబాగ్ వంతెన**

హైదరాబాద్ లోని మూసారాంబాగ్‌లో మూసీ నదిపై నూతనంగా నిర్మించిన హైలెవెల్ వంతెనను ఈరోజు సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. అనంతరం అంబర్‌పేటలోని జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ స్టేడియంలో జరిగే బహిరంగ సభలో సీఎం పాల్గొంటారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీతో పాటు మల్కాజ్‌గిరి, సైబరాబాద్ కార్పొరేషన్ల నూతన లోగోలను ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారు. వంతెన అందుబాటులోకి రావడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి.

డెస్క్

-------------------------

**కిషన్ రెడ్డి**

అలంపూర్ జోగులాంబ అమ్మవారు, బాల బ్రహ్మేశ్వర స్వామి వారిని కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించిన ఆయన, అనంతరం రూ.6.7 కోట్లతో ఆధునీకరిస్తున్న జోగులాంబ రైల్వే స్టేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి  మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా 42 రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం జోగులాంబ రైల్వే గేట్ వద్ద రూ.45 కోట్లతో ఆర్వోబీ (ROB) ని నిర్మిస్తున్నామని వెల్లడించారు. కాజీపేట రైల్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ త్వరలో ప్రారంభమవుతుందని, భవిష్యత్తులో హైదరాబాద్ నుంచి బెంగళూరు, పుణే నగరాలకు బుల్లెట్ రైళ్లు రానున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో రూ.80 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు ప్రగతిలో ఉన్నాయని తెలిపారు.

**బైట్ – కిషన్ రెడ్డి**

**పీటీసీ - జోగులంబ గద్వాల జిల్లా**

-------------------------

**ముఖ్యమంత్రి కార్యాలయం**

ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తమ ప్రజా ప్రభుత్వం 1000 రోజుల ప్రజాపాలనను విజయవంతంగా పూర్తి చేసుకుందని ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయమే ధ్యేయంగా రైతు రుణమాఫీ, మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి వంటి పథకాల ద్వారా ప్రజలకు నేరుగా లబ్ధి చేకూర్చామని పేర్కొంది. తలసరి ఆదాయ పెంపుతో పాటు ఐటీ, వ్యవసాయ రంగాల్లో రాష్ట్రం గణనీయమైన పురోగతి సాధించిందని వెల్లడించింది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, మూసీ పునరుజ్జీవనం, కొత్త పరిశ్రమలతో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ ఉపాధి అవకాశాలను

విస్తరించామని తెలిపారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు బలమైన పునాదులు వేసినట్లు సీఎంఓ వెల్లడించింది.

**డెస్క్**

-------------------------

**ఉత్తమ్ కుమార్ రెడ్డి**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలన పూర్తి చేసుకోవడంపై మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ నిరంకుశ పాలనకు ముగింపు పలికి ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించామని తెలిపారు. ఉచిత ఆర్టీసీ ప్రయాణం, రుణమాఫీ, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేశామన్నారు. భారీ ఆర్థిక లోటు ఉన్నప్పటికీ ఉద్యోగాల భర్తీ, మౌలిక వసతుల కల్పనతో రాష్ట్రాన్ని ప్రగతిపథంలో ముందుకు తీసుకెళ్తున్నామని వెల్లడించారు.

**డెస్క్**

---------------------------

**పొన్నం ప్రభాకర్**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. శాతవాహన ఇంజినీరింగ్ కళాశాల వసతి గృహ భవనాలకు శంకుస్థాపన చేసిన ఆయన, వచ్చే విద్యాసంవత్సరానికి నిర్మాణాలు పూర్తిచేసి కొత్త కోర్సులు అందుబాటులోకి తెస్తామన్నారు. నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, నవోదయ, ట్రిపుల్ ఐటీ బ్రాంచ్, కబడ్డీ అకాడమీలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఇక్కడే చదువుకుని మంచి ప్లేస్‌మెంట్స్ సాధించాలని ఆకాంక్షించిన ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు పాల్గొన్నారు.

**పీటీసీ - సిద్దిపేట**

--------------------------------

**నీట్ పీజీ 2026 పరీక్ష**

తెలంగాణలోని 14 జిల్లాల్లోని 56 కేంద్రాల్లో నీట్ పీజీ 2026 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 17,626 మందికి గానూ 17,143 మంది హాజరై 97.26 శాతం హాజరు నమోదైంది. గచ్చిబౌలిలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పరీక్ష నిర్వహణ తీరును ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. కంప్యూటర్ ఆధారిత విధానంలో జరిగిన ఈ పరీక్షకు పోలీసు, వైద్యారోగ్య శాఖల సమన్వయంతో భద్రతా ఏర్పాట్లు చేయగా, ఎలాంటి సాంకేతిక సమస్యలు లేకుండా ప్రశాంతంగా పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

**డెస్క్**

-----------------------------

**చిరంజీవి**

ప్రకృతి సంరక్షణ, పచ్చదనం పెంపు లక్ష్యంగా మట్టి వినాయకులు, సీడ్ గణేశులను పూజించాలని ప్రముఖ సినీ నటుడు చిరంజీవి పిలుపునిచ్చారు. 'గ్రీన్ ఇండియా చాలెంజ్' రూపొందించిన సీడ్ గణపతి ప్రతిమలను తన నివాసంలో ఆవిష్కరించిన ఆయన, ఇంట్లోనే నిమజ్జనం చేయడం ద్వారా విఘ్నేశ్వరుడు మొక్కగా ఎదిగి ఆశీర్వదిస్తాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రీన్ ఇండియా చాలెంజ్ రూపకర్త, మాజీ ఎంపీ సంతోష్ కుమార్ కోట్ల మొక్కలు నాటేలా ప్రజలను ప్రోత్సహించడాన్ని కొనియాడుతూ, ఆయన చేపట్టిన ఈ యజ్ఞానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

**డెస్క్**

------------------------------

**పొన్నం - గౌరవెల్లి ప్రాజెక్టు**

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. అక్కన్నపేట మండలం కట్కూరులో పర్యటించిన మంత్రి, నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభించి సంక్షేమ పథకాల లబ్ధిదారులకు చెక్కులు అందించారు. గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల భూసేకరణకు ప్రభుత్వం రూ. 250 కోట్లు విడుదల చేసిందని, త్వరలోనే టెండర్లు పూర్తి చేసి

రైతులకు సాగునీరు అందిస్తామని తెలిపారు. పాఠశాలల బలోపేతం, రోడ్ల విస్తరణ, క్రీడల ప్రోత్సాహం, ప్లాస్టిక్ రహిత గ్రామాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతూ, అన్ని రంగాల్లో గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

**పీటీసీ - సిద్దిపేట**

-------------------------------

**క్రీడా ఫిట్ నెస్ కార్యక్రమాలు**

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 28 నుంచి 30 వరకు నిర్వహించిన క్రీడా, ఫిట్‌నెస్ కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. మేజర్ ధ్యాన్ చంద్ జయంతి, ప్రత్యేక క్రీడా పోటీలు, సైకిల్ రన్‌ల ద్వారా ప్రజల్లో శారీరక దృఢత్వంపై అవగాహన కల్పించారు. యువతలో క్రీడా చైతన్యాన్ని, ఫిట్‌నెస్‌ను పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు సాగాయి.

**డెస్క్**

-------------------------

**వాతావరణం**

నైరుతి రుతుపవనాలు, ఉపరితల ఆవర్తన ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నందున వాహనదారులు, దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. మంచిర్యాల, నిజామాబాద్, సిద్దిపేట తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పొలం పనుల్లో ఉన్న రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

**డెస్క్**

---------------------------

**మై ఆటో ఈజ్ సేఫ్'**

ప్రయాణికుల భద్రతను మెరుగుపరచేందుకు సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'మై ఆటో ఈజ్ సేఫ్' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఎస్పీ నరసింహ వెల్లడించారు. కోదాడలో సుమారు 800 ఆటోలకు క్యూఆర్ కోడ్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఆటోల్లో ప్రయాణించేవారు అత్యవసర సమయాల్లో ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఎమర్జెన్సీ బటన్ నొక్కితే, పోలీసులు వాహనాన్ని ట్రాక్ చేసి వెంటనే సహాయం అందిస్తారని తెలిపారు. ప్రయాణికులు తమ సమాచారాన్ని కుటుంబ సభ్యులకు పంపడానికి కూడా ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

**పీటీసీ - నల్లగొండ జిల్లా**

------------------------------